క్లుప్తంగా

ఆలయానికి భూమి పూజ



ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న అర్చకులు

పార్వతీపురం: తిరుమలతిరుపతి దేవస్థానం సహకారంతో మండలంలోని తాళ్లబురిడి పంచాయతీ చప్పవానివలస గ్రామంలో శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ నిర్మాణానికి బుధవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ బంగారమ్మ తల్లి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణం పనులు చేపట్టేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, నాయకుడు బి. నాగేశ్వరరావుతో పాటు పలువురు పెద్దలు, యువత పాల్గొన్నారు.

19 మంది రక్తదానం



రక్తదానం చేస్తున్న దాతలు

సాలూరు: పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద బుధవారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 19 మంది రక్తదానం చేశారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ భాస్కర్‌రెడ్డి, అధికారులు గంగమ్మ, జీఎం రావు, తదితరులు ఉన్నారు.

ప్రజావసరాలకు అనుగుణంగా రేషన్ సరుకులు



సరుకులు పంపిణీ చేస్తున్న మంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: ప్రజావసరాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రేషన్ డిపోల ద్వారా సరుకులు పంపిణీ చేస్తున్నారని గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. ఈ నెల నుంచి రేషన్‌సరుకులలో అదనంగా ఇస్తున్న గోధుమపిండితో పాటు పంచదార, కందిపప్పులను బుధవారం స్థానిక ఏడో వార్డులో ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజావసరాల దృష్ట్యా పంచదార, కందిపప్పు, గోధుమపిండిలను అందిస్తున్నట్లు చెప్పారు.

నేటి నుంచి శిక్షణ

సాలూరు: సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు గురువారం నుంచి ఈ నెల ఆరో తేదీ వరకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, సాలూరు మున్సిపాలిటీలో గురువారం, 3న మెంటాడ, 4న సాలూరు మండలం, 5న పాచిపెంట, ఆరో తేదీన మక్కువ మండలంలో శిక్షణ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. శిక్షణలో ప్రజా సమస్యల గుర్తింపు.. పరిష్కారం.. ప్రభుత్వ కార్యక్రమాలు, తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు.

ఆదర్శ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఉపాధ్యాయ సిబ్బంది

మక్కువ: మండలంలోని ములక్కాయవలస ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థులు జనవరి 27, 28, 29 తేదీల్లో కర్నూల్‌లో జరిగిన 66వ రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలలో ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను బుధవారం ప్రత్యేకంగా అభినందించారు. అండర్ -14 బాలికల విభాగంలో సీదరపు సోమత, చోడిపల్లి సంధు.. అండర్ -14 బాలుర విభాగంలో ఎం.నితీష్‌కుమార్, పి.గిరిప్రసాద్.. అండర్-17 విభాగంలో పి.హేమరాజ్, సీహెచ్ జ్యోత్స్న, సీహెచ్ వెంకటలక్ష్మి ప్రతిభ కనబరిచారని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

బలిజిపేట: వంతరాం సబ్‌స్టేషన్‌లో మెయింటనెన్స్ పనులు నిర్వహించనున్నందున గురువారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్‌సరఫరా నిలిపివేయనున్నామని ఏఈ సింహాచలం తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలలో విద్యుత్ అంతరాయం కలగనున్నందున వినియోగదారులు గమనించాలని కోరారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు

- గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర



లబ్ధిదారుతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: పార్టీలకతీతంగా అత్యంత పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సువర్ణపాలన అందిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి, గిరిజన శాఖా మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మున్సిపాలిటీలోని 7వ వార్డులో మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, స్థానిక కౌన్సిలర్ వంగపండు అప్పలనాయుడు అధ్యక్షతన, కమిషనర్ శంకరరావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలు మంత్రికి ఘనస్వాగతం పలికారు. ఈ క్రమంలో ప్రతి ఇంటికీ వెళ్లిన రాజన్నదొర ముఖ్యమంత్రి జగనన్న పాలనలో ఇప్పటివరకు ఎంత లబ్ధి చేకూరిందో వివరించారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల పనితీరుపై ఆరా తీశారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ, ఎన్నికల మేనిఫెస్టోను పవిత్రగ్రంథంగా భావించి ఇచ్చిన హామీలన్నింటినీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని చెప్పారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా ముఖ్యమంత్రి అందిస్తున్న నగదును మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంభన సాధించాలని ఆకాంక్షించారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ వల్ల ప్రజలకు సేవలందుతున్నాయన్నారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో మరోసారి జగన్ మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జర్జాపు దీప్తి, ప్రజాప్రతినిధులు, నాయకులు జర్జాపు ఈశ్వరరావు, గిరి రఘు, గొర్లె వెంకటరమణ, లింగాల దుర్గ, పిరిడి రామకృష్ణ, కర్రి అప్పలస్వామి, మద్దిల గోవింద, ఎర్ర దాలినాయుడు, పతివాడ శివ, చొక్కాపు గోపి, తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



వార్డు ప్రజలతో మాట్లాడుతున్న ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్

- ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్

పార్వతీపురం టౌన్: అన్ని వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని 22వ వార్డులో ఆయన పర్యటించి నవరత్నాలు అమలు చేస్తున్న తీరుపై ప్రజలకు అవగాహన కల్పించారు. మహిళా సాధికారత, అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. శాలివాహన, కుమ్మరి కులస్తులు తయారు చేసిన మట్టి పాత్రలు, గ్లాసులను, ఇతర గృహ వినియోగ వస్తువులను పరిశీలించారు. ప్రస్తుత ఆధునిక పద్ధతుల వల్ల జీవనోపాధి కష్టతరంగా మారిందని, ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకుంటూ మెరుగైన పద్ధతుల్లో మట్టి పాత్రలు తయారు చేయాలని సూచించారు. పేదలకు నిర్మిస్తున్న పట్టణ గృహ నిర్మాణంలో భాగంలో నిరుపేదలకు ఇచ్చే ఇళ్ల స్థలాల్లో ఇళ్ల నిర్మాణం, టిడ్కో హౌసింగ్‌పై అవగాహన కల్పిస్తూ ప్రతి పేదవాడి కల అయిన సొంతింటిని సాధ్యం చేసేందుకు ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ శ్రీకాళి, ఆకుల శ్రీనివాసరావు, స్థానిక ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అనుక్షణం సంక్షేమపథం



టీడీపీ నేత మనోహర్‌కు బుక్‌లెట్ అందించి వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అనుక్షణం సంక్షేమ పథంలో నడుస్తోందని ఎమ్మెల్యే జోగారావు అన్నారు,. బలిజిపేట మండలం పలగరలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిదారులను పలకరించి ప్రభుత్వం వారికి అందజేసిన సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బుక్‌లెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సంక్షేమం పథకం అందని ద్రాక్షలా ఉండేదని, జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ప్రతి క్షణం సంక్షేమం పరుగులు తీస్తోందన్నారు. అర్హతే ప్రామాణికంగా పథకాల అమలు చేస్తున్నట్లు చెప్పారు. మహిళా సంక్షేమం, మహిళా జీవనోపాధి మెరుగుదలపై దృష్టి సారిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో అక్కా చెల్లెమ్మల సంక్షేమమే సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఆశయమన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు సక్రమంగా ప్రజలకు అందుతున్నాయా లేదా అనేది తెలుసుకునేందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. అర్హత ఉండి పథకానికి దూరమైతే తక్షణమే సమస్య పరిష్కరించాలని అక్కడే ఉన్న అధికారులను ఆదేశిస్తున్నట్లు చెప్పారు. గడప గడపకు వెళ్లేటప్పుడు ప్రజలు చెప్పే సమస్యలను అక్కడికి అక్కడే పరిష్కరించేలా అడుగులు వేయాలని చేసిన సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకే కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఆర్టీసీ సిబ్బంది రక్తదానం



రక్తదానం చేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

పార్వతీపురం టౌన్: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా జిల్లా ప్రజా రవాణా అధికారి టీవీఎస్ సుధాకర్ ఆధ్వర్యంలో జిల్లా ఆస్పత్రిలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. పార్వతీపురం డిపో నుంచి 21 మంది సిబ్బంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో ప్రతిరోజూ ఒక కార్యక్రమం వినూత్నంగా చేపడుతున్నామని చెప్పారు. రహదారి భద్రతా నియమాలు తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ పాటించి ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ కనకదుర్గ, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

మక్కువ: మండలంలోని శంబర గ్రామ సమీపంలో మద్యం తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని 42 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జి.షైడిరాజు బుధవారం తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కోడి పందాల రాయుళ్ల పట్టివేత



సుభద్ర శివారులో పట్టుబడిన పందాల రాయుళ్లతో పోలీసులు

బలిజిపేట: మండలంలోని సుభద్ర గ్రామ శివారులో కోడి పందాలు ఆడుతున్న 12మందిని బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్సై ప్రశాంత్‌కుమార్ తెలిపారు. గ్రామ శివారులో కోడి పందాలు ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడిచేసి నిందతులను అరెస్ట్ చేసి వారినుంచి రూ.21,480 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

అసైన్డ్ భూముల గుర్తింపు



అసైన్డ్ భూములను గుర్తిస్తున్న తహసీల్దార్ అప్పరావు, సిబ్బంది

భామిని: నిరుపేదలకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వ, అసైన్డ్ భూములను గుర్తిస్తున్నట్లు తహసీల్దార్ నీలాపు అప్పారావు తెలిపారు. మండల కేంద్రంలోని గుర్తించిన అసైన్డ్ భూములకు బుధవారం కొలతలు వేసి హద్దులు నిర్ణయించారు. భూమి లేని పేద ఎస్సీ, ఎస్టీలకు పంపిణీకి భూములను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఆయనతో పాటు మండల సర్వేయర్ తోట రామ్మోహనరావు, వీఆర్వో బిడ్డిక గోపాల్ ఉన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత



బీమా పరిహారం అందిస్తున్న ఏఎంసీ చైర్మన్, తదితరులు

కురుపాం: బాధిత కుటుంబాలకు వైఎస్సార్ బీమా పథకం ఆసరాగా నిలుస్తుందని కురుపాం మార్కెట్ కమిటీ చైర్మన్ నిమ్మల వెంకటరావు, ఎంపీటీసీ సభ్యురాలు రాజేశ్వరి, గ్రామసర్పంచ్ అడ్డాకుల మన్మథరావు అన్నారు. బుధవారం నీలకంఠాపురం పంచాయతీకి చెందిన బిడ్డిక వీరయ్య మృతి చెందడంతో ఆయన భార్య బిడ్డిక మయంతి, కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా కింద తక్షణ సాయంగా రూ.10 వేలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి పెద్ద దిక్కు కోల్పోయి తీవ్ర ఆవేదనలో ఉన్న వారికి వైఎస్సార్ బీమా పథకం ఆసరాగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వేతనదారులు సమయ పాలన పాటించాలి



వేతనదారుల మస్తరును పరిశీలిస్తున్న ఎంపీడీఓ కృష్ణమహేష్‌రెడ్డి

సీతానగరం: ఉపాధిహామీ పనుల్లో పాల్గొనే వేతనదారులు సమయ పాలన పాటించి ప్రభుత్వం నిర్దేశించిన వేతనం గిట్టుబాటయ్యేలా చూడాలని ఎంపీడీఓ బి.కృష్ణమహేష్‌రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం అంటిపేట పంచాయతీలోని అమ్మోబందలో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారుల మస్తరు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనదారుల మస్తరు రెండుపూటలూ వేయాలని క్షేత్రసహాయకురాలు సత్యవతిని ఆదేశించారు. వేతనదారులు సకాలంలో పనుల్లో పాల్గొనేలా చూడాలని, ఇంజినీరింగ్ సిబ్బంది ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేసి గిట్టుబాటు వేతనం కల్పించాలని సూచించారు. జాబ్ కార్డులున్న వారందరికీ ఉపాధి పనులు కల్పించడానికి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో శ్రమ శక్తిసంఘాల(మేట్‌లు) సభ్యులు పాల్గొన్నారు.

తపాలా జీవితబీమా అందరికీ చేరవేయాలి



క్లెయిమ్‌లను అందజేస్తున్న సూపరింటెండెంట్ ఎన్‌వీఎస్‌ఎన్ రాజు

పార్వతీపురం టౌన్: తపాలా జీవితబీమా అందరికీ చేరవేయాలని తపాలా సూపరింటెండెంట్ ఎన్‌వీఎస్‌ఎన్ రాజు అన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక తపాలా కార్యాలయంలో సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బ్రాంచ్ పోస్టుమాస్టర్, సబ్‌పోస్టు మాస్టర్, డైరెక్ట్ ఏజెంట్లు, ఇతర సిబ్బందికి, కస్టమర్లకు తక్కువ ప్రీమియం, ఎక్కువ లాభం గల తపాలా జీవిత బీమా పాలసీలు అందరికీ చేరువ చేయాలని దిశానిర్దేశం చేశారు. రూ.10కోట్ల విలువ గల జీవిత బీమా పాలసీలను సేకరించినందుకు సిబ్బందిని అభినందించారు. రూ. 2.28లక్షల విలువగల డెత్ క్లెయిమ్స్ మంజూరు చేసుకున్న వారికి సొమ్మును అందజేశారు. కార్యక్రమంలో తపాలా సిబ్బంది పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహం



చిరుధాన్యాల పంటలను పరిశీలిస్తున్న అధికారులు

గుమ్మలక్ష్మీపురం: చిరుధాన్యాల పంటల సాగుపట్ల రైతులు ఆసక్తి చూపాలని వ్యవసాయశాఖ కమిషనరేట్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.ప్రేమ్‌శేఖర్ అన్నారు. మండలంలోని మంగళాపురం గ్రామంలోని గిరిజన రైతులు సాగుచేసిన చిరుధాన్యాల పంటలను బుధవారం ఆయన పరిశీలించారు. చిరుధాన్యాల పంటలు సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం అనేక రాయితీలు అందిస్తోందన్నారు. రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయనతో పాటు డీఏఓ కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి సీహెచ్ ప్రసాద్ ఉన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాల అభివృద్ధే లక్ష్యం



పత్తి పంటను లారీలో తరలిస్తున్న ఆర్ట్స్ సంస్థ సభ్యులు

కురుపాం: రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఆర్థికంగా అభివృద్ధి చేయటమే లక్ష్యమని వివిధ ఉత్పత్తిదారుల సంఘాలకు చెందిన సీఈఓలు వినోద్‌కుమార్, ఎస్.సోనియా, ఉమామహేష్, ప్రభాకరరావు అన్నారు. జియ్యమ్మవలస మండలంలోని చినతోలుమండ గ్రామంలో ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో అంగరాలమ్మ సహజ ఎఫ్‌పీఓ ద్వారా కొనుగోలు చేసి పత్తిని బుధవారం తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస మండలాల్లో రైతు ఉత్పత్తిదారు సంఘాల బలోపేతమే లక్ష్యమని అన్నారు. గిరిజన రైతులకు గిట్టుబాటు ధర చెల్లించి పత్తి పంటను కొనుగోలు చేసినట్లు చెప్పారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు

- పశు సంవర్ధక శాఖ ఎ.డి నీలయ్య



మాట్లాడుతున్న పశు సవర్ధక శాఖ ఎ.డి డాక్టర్ రెడ్డి నీలయ్య

సీతానగరం: పశువుల్లో సీజనల్ వ్యాధుల నివారణకు అవసరమైన వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నామని పశువులు, గొర్రెల కాపర్లు, పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకుడు రెడ్డి నీలయ్య సూచించారు. ఈ మేరకు బుధవారం ఆయన సీతానగరం పశుసంవర్ధక శాఖ ఏడీఏ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బొబ్బిలి మండలం కోమటిపల్లి, సీతానగరం మండలంలోని కె.సీతారాంపురం గ్రామీణ పశువైద్య కేంద్రాలను, కాశీపేట రైతు భరోసాకేంద్రాన్ని సందర్శించి గ్రామాల్లో రైతులకు పశువైద్యం అందుబాటులో ఉండేలా అధికార సిబ్బందిని అప్రమత్తం చేశామని తెలిపారు. సీజన్ల వారీగా పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లకు వ్యాధినిరోధక టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 1వ తేదీ నుంచి 28 వరకూ గొర్రెలు, మేకలకు పీపీఆర్ వ్యాధి నిరోధక టీకాలు, కోళ్లకు కొక్కెర వ్యాధి, మసూచి వ్యాధి నిరోదక టీకాలు వేయనున్నట్లు చెప్పారు.

ఏహెచ్‌ఏలకు 5 రోజుల శిక్షణ

గ్రామాల్లో పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి డివిజన్‌లో పశుసంవర్ధక శాఖ సహాయకులకు అవసరమైన శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. బొబ్బిలి డివిజన్ పశుసంవర్ధక శాఖ పరిధిలో గల రైతుభరోసా కేంద్రాల్లో నియమితులైన పశువైద్య సహాయకులకు పశువైద్యం పట్ల పూర్తిస్థాయిల్లో అవగాహన లేక పోవడంతో వారందరికీ సబ్‌డివిజన్ పరిధి, మండల పశువైద్య కేంద్రాల్లో 5 రోజుల పాటు శిక్షణ తరగత్తులు నిర్వహిస్తున్నామని తెలియజేశారు. శిక్షణ తరగతులకు పశువైద్య సహాయకులు విధిగా హాజరు కావాల్సి ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీతానగరం సబ్‌డివిజన్ పశువైద్య శాఖ ఏడీఏ సీహెచ్ దీనకుమార్ పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యమే జగనన్న లక్ష్యం

- ఎమ్మెల్యే జోగారావు



టెంకాయ కొట్టి శిలాఫలకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే జోగారావు తెలిపారు. మండలంలోని పెదపెంకిలో ఎస్టీ కాలనీలో రూ.4.50లక్షలతో నిర్మించిన ఇంటింటి కుళాయి పథకాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాలను అభివృద్ధి చేసి ప్రజలకు సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి ఫలాలు అందించడమే ముఖ్యమంత్రి లక్ష్యమన్నారు. ఎస్టీ కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డు, వీధికాలువలను పరిశీలించారు. గ్రామాలలో సీసీ రోడ్ల నిర్మాణాలకు, గ్రామాలను కలుపుతూ లింకు రోడ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలలో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.పాపారావు, ఎంపీడీఓ భానుమూర్తి, ఎంపీపీ జి.నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, జి.శ్రీను, జి.జగన్, సీహెచ్.సత్యం, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

గృహ సారథులకు శిక్షణ తరగతులు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి కుటుంబానికీ అందజేయాలన్న సంకల్పంతోనే 50 కుటుంబాలకు ఇద్దరు గృహసారథులను నియమించారని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. బుధవారం సీతానగరం వచ్చిన వచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహసారథులకు ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా ఉన్న బహిరంగ ప్రదేశంలో గురువారం శిక్షణ ఇస్తారని చెప్పారు. సచివాలయాల వారీగా రెండు విడతలుగా రెండు రోజులు (గురు,శుక్ర వారాలు) శిక్షణ ఇస్తారని తెలిపారు. గురువారం గెడ్డలుప్పి, గుచ్చిమి, సూరంపేట, పెదభోగిలి, చినభోగిలి, తామరఖండి,బగ్గందొరవలస, కాశాపేట, అంటిపేట, ఆర్ వెంకంపేట లచ్చయ్యపేట సచివాలయాల పరిధిలో గృహసారథులకు శిక్షణ ఉంటుందని, అందరూ హాజరయ్యేలా ప్రజాప్రతినిధులు బాధ్యత తీసుకోవాలని చెప్పారు.

కార్యక్రమంలో వ్యవసాయ సలహామండలి జిల్లా చైర్మన్ వి.నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు టి. వెంకటప్పలనాయుడు, మండల వ్యవసాయ సలహాకమిటీ అధ్యక్షుడు పి. ఈశ్వరనారాయణ, చినంకలాం సర్పంచ్ పి.తిరుపతిరావు, ఆర్‌వీ పార్థసారథి పాల్గొన్నారు.

4న ధర్నా విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు

సీతానగరం:

మండలంలోని రైతుల కళ్లాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరుతూ ఈనెల 4న తహసీల్దార్ కార్యాలయం ఎదుటనిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్ లక్ష్మునాయుడు కోరారు. ధర్నా విజయవంతం చేయాలని కోరుతూ తయారుచేసిన వాల్‌పోస్టర్‌ను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామని ఇచ్చిన హామీ నిలుపుకోలేదన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ మధ్యలో నిలిపివేయడంతో చిన్న, సన్నకారు రైతుల వద్ద నిల్వలుండిపోయాయన్నారు. ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా అమలు చేయడంలో అధికారులనుంచి స్పందన లేదన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా, మండల నాయకులు రెడ్డి రమణమూర్తి, రెడ్డి ఈశ్వరరావు, బి.అప్పారావు, సీహెచ్ కృష్ణ పాల్గొన్నారు.